విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 27, జూన్ 2024

దౌర్జన్యంగా సాగు చేస్తున్న జంగం సుదర్శన్ నుండి భూమిని కాపాడండి

విశాలాంధ్ర - నంద్యాల : ఆళ్లగడ్డ తాలూకా రుద్రవరం మండలం ఎల్లావత్తుల గ్రామ రెవెన్యూ సర్వే నెంబరు 693లో వడ్డే సుబ్బరాయుడు కుటుంబీకులు గత 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని, అడ్డగోలుగా అవినీతి అధికారులను అడ్డు పెట్టుకొనిపై సర్వే నెంబర్ భూమిని దౌర్జనంగా జంగం సుదర్శన్ తన పేరుతో పట్టా పాస్ పుస్తకాలు తయారు చేసుకున్నాడని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు ఆరోపించారు. పొలం సాగులో ఉన్న వడ్డే సుబ్బరాయుడు కుటుంబాన్ని ఎస్సీ పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని జిల్లా అధికారులు అతనిపై చర్యలు చేపట్టి తన పొలాన్ని అసైన్, అడంగల్ హక్కు కల్పించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు హరినాథ్, బాధితులు వడ్డే సుబ్బరాయుడు కుటుంబీకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ ఆళ్లగడ్డ తాలూకాలో రైతులు సాగు చేసుకుంటున్న పొలాలలో అక్రమంగా దౌర్జన్యాలు చేస్తూ అసలైన వారసులని భయభ్రాంతులకు గురి చేస్తున్నా రెవెన్యూ అధికారులు, పోలీస్ యంత్రాంగం ఏ మాత్రం పట్టించుకోవడం విచారకరమన్నారు. రుద్రవరం మండలం ఆలమూరు గ్రామంలో నాయి బ్రాహ్మణ పొలాలను సాగు చేయ కుండా వైసీపీ నాయకులు గతంలో సాగు చేసుకున్న పొలాలను సాగు చేయ నీయ కుండా అడ్డుకోవడం జరిగిందని, సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి, సీపీఐ నాయకులు పెట్టిన కేసు గత అధికార పార్టీ నాయకులపై ఏమాత్రం చేపట్టకపోవడం దుర్మార్గ మన్నారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి న్యాయపరంగా వడ్డే సుబ్బరాయుడు సాగు చేసుకునే భూమిని రెవెన్యూ అధికారులు పరిశీలించి ఆక్రమిం చిన జంగం సుదర్శన్ అక్రమంగా అసైన్ చేసు కున్న దాన్ని తొలగించి వడ్డే సుబ్బరాయుడుకి న్యాయం చేయాలని లేనివక్షంలో సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

ఉద్యోగం ఇప్పించి ఆదుకోండి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర -డోన్ : మున్సిపాలిటీలో గత ఐదేళ్ల కిందటి నుండి మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య, కార్యాల సిబ్బందిలో ఆరుగురు విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు అనారోగ్యంతో మరణించారని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, వారి పీఎఫ్ డబ్బులు ఇచ్చి ఆదుకోవాలని డోన్ సీపీఐ, మున్సిపల్ కౌన్సిలర్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గ కార్యదర్శి జి.అబ్బాస్, మున్సిపల్ యూనియన్ నాయకులు హరి చంద్ర విజయ రెడ్డిలు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ మున్సిపల్ కౌన్సిలర్, ఏఐటీయూసీజిల్లా ప్రధాన కార్యదర్శి పి సుంకయ్య కౌన్సిల్లో మున్సిపల్ విధుల్లో నిర్వహిస్తూ మరణించిన విషయం అందరికీ తెలుసని కౌన్సిల్లో తీర్మానం చేసి మరణించిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పిఎఫ్ డబ్బులు వాళ్ళకి అందించాలని కౌన్సిల్లో ప్రస్తావించారు.కౌన్సిల్లోనే స్థానిక ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి విన్నవించారు.స్పందించిన కోట్ల మున్సిపల్ కమిషనర్ ని అడిగి పెండింగ్లో ఉన్నటువంటి మరణించిన కుటుంబాల ఫైల్ ను కదిలించి వెంటనే ఉద్యోగాలకు తీసుకోవడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే...

విశాలాంధ్ర-డోన్ : గ్రాడ్యుయేషన్ డే ను అంగన్ వాడి సిబ్బంది ఘనంగా నిర్వహించారు. బుధవారం డోన్ మండల పరిధిలోని ఎద్దుపెంట గ్రామంలో కొత్త కోట సెక్టార్ సూపర్ వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను తప్పనిసరిగా అంగన్ వాడి కేంద్రంలో చేర్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో చదువుతో పాటు పౌష్టికహారం అందించడం జరుగుతుందన్నారు. అంగన్ విద్యా తర్వాత ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. విద్యతో పాటు పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందజేస్తారన్నారు. తల్లితండ్రులు విద్య పట్ల నిర్లక్ష్యం చేయకుండా చిన్నారులను చదివించాలన్నారు.అదేవిదంగా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం అంగన్వాడి విద్య పూర్తి చేసిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ చేశారు. ప్రధానోపాధ్యా యులు చంద్రశేఖర్,నాగరాజు, సూపర్ వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ అంగన్ వాడి సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి మెమో

విశాలాంధ్ర - రుద్రవరం : విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తున్న మంద లూరు సచివాలయ సిబ్బందికి మెమో జారీ చేయడం జరిగిందని ఈవోపి ఆర్డి శ్రీనివాస శర్మ తెలిపారు. బుధవారం ఆయన మందలూరు సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 26వ తేదీ వరకు హాజరు పట్టికలో సంతకాలు చేయని నలుగురు సచివాలయ సిబ్బందికి మెమో జారీ చేశామన్నారు. వారు 3 రోజుల్లోగా మెమోకు తమ వివరణ ఇవ్వాలని తెలిపామన్నారు. సచివాలయాలకు సక్రమంగా హాజరుకాని సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. మూమెంట్ రిజిస్టర్‌ను తప్పనిసరిగా సిబ్బంది నిర్వహించాలన్నారు. హాజరు పట్టికలో తప్పనిసరిగా సంతకాలు చేయాలన్నారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని గొడిగనూరు గ్రామానికి చెందిన 14 ఏళ్ల వయస్సు ఉన్న బాలిక అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని ఎస్సై రమణయ్య బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన బాలిక ఈనెల 25వ తేదీ ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయిందని తిరిగి రాకపోవడంతో తండ్రి తమకు ఫిర్యాదు చేశామని తెలిపారు. బాలిక తండ్రి (వీ.సూర్యనారాయణ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ఉన్నామని ఎస్సై వివరించారు.

మున్సిపాలిటీ స్థలాన్ని కబ్జా చేస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర- నంది కొట్కూరు: నంది కొట్కూరు మున్సి పాలిటీ పరిధిలో ఉన్న స్థలాలను ఎవరైనా కబ్జా చేసినట్లు తెలిస్తే వారిపై కఠినమైన చర్యలు తప్పవని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక అమ్మ హెూటల్ ఎదురుగా ఉన్న పాండురంగ స్వామి దేవాలయం ముందర ఉన్నటువంటి మున్సిపాలిటీ స్థలాలను స్థానిక మున్సిపాలిటీ కమిషనర్ సుధాకర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో దేవాలయం ముందర మెకానిక్ షెడ్‌లు ఉండేవని, అయితే అప్పుడు ఉండే మున్సిపల్ కమిషనర్ లంచాలకు పాల్పడి పేద ప్రజలు వేసుకున్న షెడ్లను తొలగించి వైసిపి నాయకులకు కట్టబెట్టారన్నారు. గత ప్రభుత్వంలో సర్వేనెంబర్ 410/1లో 20 సెంట్ల మున్సిపాలిటీ ఓపెన్ స్థలాన్ని కబ్జా చేసిన వారిని వదిలిపెట్టేది లేదన్నారు. అధికార దాహంతోవైసిపి నాయకులు ఎక్కడ పడితే అక్కడ మున్సిపాలిటీ స్థలాలను కబ్జాలు చేసుకొని పేద ప్రజల కడుపులు కొడుతూ దౌర్జన్యంగా వ్యవహరించారని, ఇప్పటినుంచి వారి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో చిరుత

విశాలాంధ్ర - మహానంది : మహానంది క్షేత్ర సమీపాన చిరుత పులి సంచారం స్థానికుల్లో కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది .చిరుత పులి సంచరించినట్లు తెలిసింది. ఆలయ సమీపంలో గోశాల వద్ద చిరుత పులి నడుస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఆలయ చెంతనే ఉన్న నల్లమల అడవిలో నుంచి చిరుత పులి వచ్చినట్లుగా స్థానికులు చెబుతున్నారు. గత పది రోజులుగా చిరుత పులి ఇక్కడ తిరుగుతోందని వారు తెలిపారు. ఆలయం చుట్టూ విద్యుత్ సబ్ స్టేషన్, అన్నదాన సత్రం తదితర ప్రదేశాల్లో చిరుత తిరిగిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. సీసీ కెమెరాలో చిరుత పులి దృశ్యాల ఆధారంగా ఆలయ అధికారులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. చిరుత పులి కాలి ముద్రలను సేకరించి విచారణ చేపట్టారు. కాగా మంగళవారం నంద్యాల గిద్దలూరు రహదారిలో పచ్చర్ల వద్ద చిరుత పులి దాడిలో ఓ మహిళ మృతి చెందింది. అక్కడ దాడి చేసిన చిరుత, మహానందిలో సంచరించే చిరుత ఒకేటేనా, వెర్వేరా అనే విషయం తెలియాల్సి ఉంది.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించండి : ఎమ్మెల్యే కోట్ల

విశాలాంధ్ర -డోన్ : నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నిరుద్యోగులను గుర్తించి, వారికి ఉపాధి కల్పించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులకు డోన్ శాసనసభ సభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి ఆదేశించారు. బుధవారం డోన్ పట్టణంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ చైతన్య, ప్రతినిధులు భూపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ చదువుకొని ఉద్యోగ,ఉపాధి అవకాశాలులేని వారికి తదనుగుణంగా వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి లేకపోతే చెడు మార్గంలో పయనించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాంటి పరిస్థితులను తాను అంగీకరించబోనని ఆయన స్పష్టం చేశారు. ప్రతి నిరుద్యోగికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రైవేట్ రంగంలో ఎక్కడ ఉద్యోగ అవకాశాలు ఉండేది ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రతి నెలా డోన్ పట్టణంలో ఒక జాబ్ మేళా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు వారి అభిప్రాయం మేరకు అవసరమైన శిక్షణను నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా అందజేసి వారికి అవసరమైన ఉద్యోగ లేదంటే ఉపాధి అవకాశాలను కల్పించేందుకు సంస్థ నిత్యం శ్రమించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో యువతీ, యువకులు ఉపాధి లేకుండా ఉండకూడదు అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమన్నారు. అదే ఆశయంతో తాను సైతం యువతకు ఉద్యోగాలు లేదంటే ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ముందుంటానని తెలిపారు. డోన్ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభించేంతవరకు తాను వీలైనప్పుడల్లా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ఉంటానని ఎప్పటికప్పుడు తాజా సమాచారంతో ప్రతినిధులు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు.

భాష్యం విద్యా సంస్థలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర-డోన్ : ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తూ పాఠ్యపుస్తకాలను అమ్ముతున్న భాష్యం విద్యా సంస్థల ముందు నిరసన నిర్వహించగా, స్పందించి డిప్యూటీ డీఈవో సూపరింటెండెంట్ నాయక్, ఎంఈఓ ప్రభాకర్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్య ప్రతాప్ మాట్లాడుతూ డోన్ పట్టణంలో మాముళ్లకు, మత్తునకు అలవాటు పడి విచ్చలవిడిగా ఎలాంటి వసతులు లేకున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు అనుమతులు ఇస్తున్నారని మండిపడ్డారు. రోజురోజుకి ప్రవేట్ విద్యా సంస్థలు పుట్టగొడుగుల్లాగా పుట్టుకొని వస్తున్నాయన్నారు. వాటిని అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు విఫలం అయ్యారని వారు మండిపడ్డారు. ఒకవైపు బిల్డింగ్ కన్స్ట్రక్షన్ జరుగుతున్నప్పటికి ఒక వైపు క్లాసులు నిర్వహిస్తూ మరోవైపు పాఠశాల భవనంలో ఒక గదిని షాపుగా పెట్టుకొని యూనిఫాంలు పాఠ్యపుస్తకాలు అమ్ముతూ అక్రమాలకు పాల్పడుతున్న విద్యాసంస్థల పైన, వారి మేనేజ్మెంట్ పైన క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు మనోజ్, శశిధర్ రెడ్డి, రంగస్వామి,అశ్వత్, ధర్మతేజ్, రాము తదితరులు పాల్గొన్నారు.

తపాలా భీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - చాగలమర్రి : గ్రామీణ తపాలా జీవిత భీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జిల్లా పోస్టల్ సూపరెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మద్దూరు గ్రామంలో పోస్టాఫీస్‌లలో లభించే పథకాలపై జిల్లా పోస్టల్ సూపరెండెంట్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ తపాలా జీవిత భీమా 19 నుండి 55 ఏళ్ల వయస్సు లోపు పట్ట భద్రులకు, ఉద్యోగస్తులకు పోస్టల్ ఇన్సూరెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. 19 నుండి 65 ఏళ్ల వయస్సు గల వారు సంవత్సరానికి రూ.329 కడితే రూ.5 లక్షలు, రూ.549 కడితే రూ.10 లక్షలు, రూ.750 కడితే రూ.15 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కలదన్నారు. పోస్టల్ శాఖలో సాదారణ పొదుపు ఖాతా, ఐదేళ్ల ఆర్‌డి, పదేళ్లలోపు బాలికలకు సుకన్య సమృద్ధి ఖాతా,పిపిఎస్ ఖాతా లాంటి పథకాలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ మనోజ్ కుమార్, ఆళ్ళగడ్డ పోస్టల్ ఇన్స్పెక్టర్ రామనాథ్, పోస్టల్ సిబ్బంది సాధిక్, భాస్కర్ రావు, పెద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మాదకద్రవ్యాల నియంత్రణ దినోత్సవ సందర్భంగా భారీ ర్యాలీ

విశాలాంధ్ర - నంద్యాల : పట్టణంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లా కలెక్టర్ కె శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డిల ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ వద్ద నుండి శ్రీనివాస సెంటర్ వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఆఫీస్ వద్ద వివిధ కళాశాలల విద్యార్థులు, గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులు, ఎన్జీవోలు, మానసిక వైద్య నిపుణులు, రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా పోలీసు సిబ్బంది, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులచే భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీని ముందుగా జిల్లా కలెక్టర్, ఎస్పీ జండా ఊపి ప్రారంభించడం జరిగింది. అనంతరం డ్రగ్స్ వాడటం వలన కలిగే దుష్ప్రభావాల గురించి ప్లే కార్డులు ప్రదర్శిస్తూ లిడ్రగ్స్ వద్దు ఆరోగ్యమే ముద్దు అనే నినాదాలతో ముందుకు సాగడం జరిగింది. ఈ ర్యాలీ సంజీవ్ నగర్ గేట్ మీదుగా చందన బ్రదర్స్ బోర్డ్, శ్రీనిధి సెంటర్, శ్రీనివాస సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం శ్రీనివాస సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ వలన కలిగే దుష్ప్రభావాల గురించి నినాదాలతో జిల్లా ప్రజలకు, విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు నంద్యాల జిల్లా అంతటా ఈ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీలు, స్కూల్లో కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి డ్రగ్స్ వలన కలుగు దుష్ప్రభావాల గురించి అనారోగ్య సమస్యల గురించి వారికి తెలియజేయడం జరిగిందని, యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా ఉండే విధంగా అన్ని రకాల నియంత్రణ కార్యక్రమాలు చేయడం జరుగుతుందని, కావున ప్రజలు, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండి ఆరోగ్యవంతులుగా జీవించాలని, జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ కొరకు పిడి యాక్ట్‌లు పెట్టడం జరిగిందని, మాదకద్రవ్యాల నియంత్రణ కొరకు అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలియజేశారు. అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్, ఏఆర్ డిఎస్పి శ్రీనివాసులు, డిపార్ట్మెంట్ అధికారులు, ఇన్స్పెక్టర్లు ఇస్మాయిల్ ,రాజారెడ్డి, నరసింహులు, చలపతి, దస్తగిరి బాబు, ఆర్ఐలు మంజునాథ్ శ్రీనివాసులు, సబ్ డివిజన్ సబ్ ఇన్స్పెక్టర్లు పోలీస్ సిబ్బంది వివిధ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

డోన్ అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా వడ్డే మహారాజు

విశాలాంధ్ర - నంద్యాల : డోన్ అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా వడ్డే మహారాజును నియమించినట్లు నంద్యాల జిల్లా బిజెపి పార్లమెంటు కోఆర్డినేటర్ అభిరుచి మధు తెలిపారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా పార్లమెంటు కోఆర్డినేటర్ అభిరుచి మధు నాయకత్వం లో డోన్ అసెంబ్లీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో కార్యకర్తలకు, నాయకులకు దిశ నిర్దేశం చేయడం జరిగింది. ఈ సందర్భంగా డోన్ అసెంబ్లీ కోఆర్డినేటర్ గా ఏకగ్రీవంగా వడ్డే మహారాజుతో పాటు మండల, రూరల్ స్థాయి అధ్యక్షులు కూడా ఎన్నుకోవడం జరిగింది. డోన్ టౌన్ అధ్యక్షుడుగా కే అశోక్ కుమార్ ను, రూరల్ అధ్యక్షుడిగా దేవేంద్రను ఎంపిక చేసినట్లు అభిరుచి మధు తెలిపారు. అలాగే ప్యాపిలి మండల అధ్యక్షుడుగా రమేష్, బేతంచర్ల రూరల్ అధ్యక్షుడిగా ఆంజనేయులును ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ముఖ్య నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగన్న, డోన్ మాజీ అసెంబ్లీ కోఆర్డినేటర్ రమణ, ఉపాధ్యక్షులు నిమ్మకాయల సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రమాల బాలమణి, లక్ష్మారెడ్డి, రామయ్య, భరణి రమేష్, మద్దిలేటి, రామయ్య తదితర బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి..

విశాలాంధ్ర-డోన్ : డోన్ పట్టణ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థినీలు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ గీత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 9వ తరగతిలో ఎస్సిలకు-2, బీసీలకు-1 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పరీక్ష సిబిఎస్సిలో ఉంటుందన్నారు. ఆశక్తి ఉన్న విద్యార్థినీలు కళాశాలలో ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, 2 పాస్ ఫోటోలు జత పరచి అందజేయాలన్నారు. పరీక్ష 50 మార్కులకు ఉంటుందని, అర్హత సాధించిన వారికి సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.

జానకిరామ్ సేవలు విద్యాభివృద్ధికి ఎనలేని

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : పదవి విరమణ పొందిన మండల విద్యాధికారి జానకి రామ్‌కు డౌపాల్ హైస్కూల్ పాదర్ ప్రిన్స్ పాదర్ వినీత్ జానకిరామ్ దంపతులకు శాలువా కప్పి పూల బొకే ఇచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా ఫాదర్ ప్రిన్స్ ఫాదర్ వినీత్ మాట్లాడుతూ మండల విద్యాధికారిగా జానకిరామ్ విద్యాభివృద్ధికి ఎనలేని సేవలు చేశాడని తెలిపారు. ఈ విశ్రాంతి సమయంలో ఆయనకు ఆయురారోగ్యాలు శాంతి సౌభాగ్యాలతో విరిసిల్లాలని కోరారు. ఇదే కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సిఐలు లక్ష్మీనారాయణ, మరియు నాగభూషణం, ఎస్ఐ వెంకటనారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ హరి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పాఠశాలలో పిల్లలను చేర్చండి

విశాలాంధ్ర - డోన్ రూరల్: గ్రామాలలో అంగన్వాడి పాఠశాలల్లో పిల్లలను చేర్పించి బడికి పోయే విధానాన్ని చిన్న పిల్లలకు అలవర్చాలని సూపర్వైజర్ పద్మావతి అన్నారు. మండలంలోని కొత్తకోట సెక్టర్‌లో ఉన్న పెద్ద పెంట గ్రామంలో బుధవారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే పురస్కరించుకొని విద్య ప్రాధాన్యాన్ని వివరించారు. అంగన్వాడీ విద్యను పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ పాఠశాలలో ఒకటవ తరగతిలోకి చేర్పించడం, అంగన్వాడీలో ఉన్న విద్యార్థులకు పోషక ఆహారాన్ని అందించడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం చంద్రశేఖర్, నాగరాజు, తిప్పమ్మ,అంగన్వాడీ టీచర్స్ రాజేశ్వరి, ఉషారాణి, విజయలక్ష్మి, నాగ శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ దశలోనే కూలుతున్న ఆలయన నిర్మాణం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని నంద్యాల గిద్దలూరు రహదారి ప్రక్కన నల్లమల అడవిలో వెలసిన శ్రీ సర్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రహరీ నిర్మాణం సంవత్సరాల తరబడి కొనసాగుతోంది. నాణ్యత ప్రమాణాలు లేకుండా ఆర్సీసీ కాంక్రీట్ వాళ్ నిర్మించాల్సిన కాంట్రాక్టర్ రాతి గోడ కడుకుండడంతో అది నిర్మాణ దశలోనే కూలిపోవాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది. ఇటీవల నిర్మించిన రాతిగూడ ఉబ్బి ఎక్కడ భక్తులపై పడుతుందోనని భయందొలణ చెందారు. ఉబ్బిన గోడ క్రింద పడిపోయినట్లు భక్తులు తెలియజేశారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ఒరిగిన గోడకు ఎన్ని పోట్లు పెట్టిన నిలబడలేక ఎట్టకేలకు నేల కూలినట్లు తెలిపారు. గోడపడిన సమయంలో భక్తులు ఎవరు అటువైపు వెళ్లకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని ఇప్పటికైనా అధికారులు స్పందించి నత్త నడకన సంవత్సరాల తరబడి కొనసాగిస్తూ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుని ఆర్‌సిసి కాంక్రీట్ వాల్ నిర్మాణం చేపట్టేలా ఆదేశించాలని శ్రీ సర్వ లక్ష్మీ నరసింహ స్వామి భక్తులు పేర్కొంటున్నారు. నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల పరిసరాలు కూలిపోయి అసౌకర్యంగా ఉండడం వల్ల ఆలయానికి సంబంధించిన ధ్వజస్తంభం కూలిపోయి సుమారు ఐదేళ్లు కావస్తున్నదని తిరిగి యువజన స్తంభ జీర్ణోద్ధరణ ఏర్పాటు చేసేందుకు వీలు లేక పోతున్నదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టు ఆర్ సి సి కాంక్రీట్ వాల్ నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేసి ధ్వజస్తంభ జీర్ణోద్ధరణ ఏర్పాటు చేయాలని భక్తులు సూచిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించండి : మంత్రి

విశాలాంధ్ర - నంద్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు అధ్యక్షత వహించి జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక వసతులతో కూడిన ఫర్నిచర్ తో పాటు ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు, స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేస్తుందన్నారు. తాను మున్సిపల్ చైర్మన్ గా ఉన్నప్పటి నుంచి పాఠశాల వసతులపై చేసిన కృషిని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో అదనపు గదులు, వసతులను మెరుగుపరచడం తదితర అంశాలపై డిఇఓ ప్రతిపాదించిన అంశాలను పరిగణలోనికి తీసుకొని పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పాఠశాలల అవసరాలు, సమస్యలు తన దృష్టికి తెస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరింత అభివృద్ధికి తోడ్పడతానని మంత్రి వివరించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడేలా విద్యాభ్యాసాన్ని అందించాలని మంత్రి కోరారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులతో కూడిన సదుపాయాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం ఆహార పదార్థాల సరఫరలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. విద్యా బోధనకు అవసరమయ్యే పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు ఇతర పరికరాలను స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ ద్వారా విద్యార్థులందరికీ పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. అనంతరం ప్రభుత్వ బాలికల పాఠశాల, కేజీబీవీ జనరల్, కేజీబీవీ మైనారిటీ, చిన్మయ పాఠశాలల విద్యార్థులకు మంత్రి, కలెక్టర్ స్టూడెంట్స్ కిట్స్ లను పంపిణీ చేశారు. అంతకుముందు పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మల్లికార్జున రెడ్డి, తాసిల్దార్ చంద్రశేఖర్, డీఈవో సుధాకర్ రెడ్డి, ఏఎంఓ లలిత కుమారి, నంద్యాల ఎంఈఓ బ్రహ్మం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 27, జూన్ 2024

విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కర్నూలు నగరంలో స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవనం నందు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, డి సోమన్న, యస్. షాబీర్ భాష,మాట్లాడుతూ కాకినాడలో జులై 8, 9, 10 తేదీలలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. విద్యార్థులకు చదువుతోపాటు రాజకీయాల పైన మరియు ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థి దశలోనే నేర్చుకోవాలని తెలిపారు. కేవలం చదివే కాకుండా ఈ సమాజానికి ఉపయోగపడే విధంగా ఈ సమాజంలో విద్యావ్యవస్థలో జరుగుతున్నటువంటి అవినీతిని వెలికితీయడానికి, అవినీతి అక్రమాల పైన పోరాటాలు చేయడానికి ఈ శిక్షణా తరగతులలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలో రాష్ట్రంలో విద్యారంగంలో వస్తున్న మార్పులపై సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులపై విద్యార్థులలో చైతన్యం నింపడానికి విద్యార్థుల శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల దృష్టిని ఆలోచించి తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చినటువంటి హామీలను ప్రస్తుతం అధికారంలోకి రావడంతో విద్యార్థుల హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు. డిగ్రీ ప్రవేశాలను ఆన్లైన్ విధానాన్ని రద్దుచేసి ఆఫ్లైన్ విధానంలో కొనసాగించాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిపథ్ పథకాన్ని తక్షణమే రద్దు చేయాలి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : దేశ రక్షణను పణంగా పెట్టే అగ్నిపథ్ పథకాన్ని వెంటనే రద్దుచేసి పాత పద్ధతిలోనే ఆర్మీ రిక్రూట్మెంట్ చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐవైఎఫ్ జాతీయ సమితి పిలుపుమేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందున్న గాంధీ విగ్రహం వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమం ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బిసన్న అధ్యక్షతన జరిగింది ఈ ధర్నా నుద్దేశి ంచి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసులులి మాట్లాడుతూ భారతదేశంలో రైల్వే వ్యవస్థ తర్వాత అత్యధిక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ సైనిక వ్యవస్థ దేశంలో రెండో స్థానంలో ఉందని అలాంటి దేశ రక్షణ వ్యవస్థను సైతం ప్రైవేటీకరణకు పూనుకోవడం మోడీ ప్రభుత్వానికి చెల్లిందన్నారు. కేంద్రప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని ఈ పథకం ద్వారా ఆర్మీలో కేవలం నాలుగేళ్లు మాత్రమే ఉపయోగించుకొని తర్వాత ఇంటికి పంపి వారికి ఎటువంటి పెన్షన్, ఇతర సదుపాయాలు లేకుండా చేయడం చూస్తుంటే బిజెపికి దేశ రక్షణ పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దేశ రక్షణ వ్యవస్థను ప్రైవేటు వారికి అప్పగించరాదని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అగ్నిపథ్ పథకం వలన ఇప్పటికే దేశ వ్యాప్తంగా యువత నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైన, కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. అగ్నిపత్ పథకం ద్వారా 100 మందిని ఆర్మీలోకి తీసుకుంటే, వారిలో 25 మందిని మాత్రమే పర్మినెంట్‌గా ఆర్మీలోకి తీసుకుంటారని, మిగిలిన 75 మంది నాలుగేళ్ల తర్వాత, 11 లక్షల తీసుకుని బయటికి పోవాల్సి వస్తుందని తద్వారా దేశ రక్షణకు ముప్పు ఏర్పడుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా కేంద్రంలో ఉన్న మోడీ బిజెపి ప్రభుత్వం కుయుక్తులు మానుకొని జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేస్తూ జీవో విడుదల చేయాలని, పాత పద్ధతుల్లోనే ఆర్మీ రిక్రూట్మెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి జి చంద్రశేఖర్, నగర కార్యదర్శి అంజిలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, షాబీర్ బాష, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈ శ్రీరాములు, ఏఐవైఎఫ్ నగర్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ, నగర నాయకులు కాశి, హుస్సేన్ బాష, శ్రీకాంత్, వీరన్న, రాజ్ కుమార్, శివ, రాముడు, రాకేష్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ పంప్ సెట్లకు విద్యుత్ కనెక్షన్లు

విశాలాంధ్ర- కర్నూల్ సిటీ: సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెండింగ్ ఉన్న 8,532 మంది రైతుల విద్యుత్ మోటర్లకు కనెక్షన్లు ఇచ్చే పనులను తిరిగి ప్రారంభిస్తామని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎం.ఉమాపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా వ్యవ సాయ కనెక్షన్ లకు అప్లై చేసిన వారికి డిమాండ్ నోటీసు ఇచ్చి మంజూరు పత్రాలను ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ పూర్తయినందున వీటిని తక్షణమే మంజూరు చేసి, ఆయా కనెక్షన్ అప్లై చేసిన వారికి డిమాండ్ నోటీసులు పంపమని కొత్త ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా రైతులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సకాలంలో నిధులు విడుదల చేయాలి

విశాలాంధ్ర - పెద్ద కడబూరు: గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధులు విడుదల చేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని గ్రామ సర్పంచుల సంఘం ద్వారా పెద్దకడబూరు గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, కల్లుకుంట గ్రామ సర్పంచ్ ఇస్మాయిల్ బుధవారం కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన 5వ ఆర్థిక సంఘం రాష్ట్ర బృందానికి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు పంచాయతీలకు నిధులు అవసరమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పత్తి పంటలను పరిశీలన

విశాలాంధ్ర - సి.బెళగల్ : పత్తి విత్తనం వేసి 15, 20 రోజులైన రైతుల పత్తి పంటలను బుధ వారం మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ రైతులతో కలిసి పరిశీలించారు. బుధవారం మండల పరిధిలోని ఈర్లదిన్నె, బ్రాహ్మణ దొడ్డి గ్రామాల్లో రైతులు వేసిన ప్రతి పంటలను ఆయన పరిశీలించి అనంతరం ఆయన రైతులకు పత్తి పంటలో ప్రస్తుతం పాటించవలసిన యాజమాన్య పద్ధతులను గురించి తెలియజేశారు. ప్రత్తి పంటలో వచ్చే తెల్ల దోమ, పచ్చ దోమ ఉధృతికి ఒక లీటర్ నీటికి ఒక ఎంఎల్ క్లోరోపైరిపాస్ మరియు ఆసిపేట్ అలాగే 5 ఎంఎల్ వేప నూనె కషాయమును కలిపి పత్తి పంటపై పిసికారి చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. వ్యవసాయ అధికారి వెంట వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో రవీంద్ర, శ్రీకృష్ణ విజయకేతనం

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంప్రూవ్‌మెంట్ ఫలితాలలో రవీంద్ర, శ్రీకృష్ణ జూనియర్ కళాశాలలు అద్భుత ఫలితాలు సాధించాయి. జూనియర్ ఎంపీసీ విభాగంలో కె.రాజేశ్వరి 467, ఎన్.చరిత 464, పి.నేహా సుమయ 464, షేక్ రుక్సానాబీ 463, బి.శివమనీషా 463, బైపిసి విభాగంలో బి.ఉషారాణి 435, బి.వెన్నెల 432 అర్సియా సుల్తానా 431, కె.శిరీష 431 మార్కులు సాధించి కళాశాలల టాపర్లుగా నిలిచారు. ఈ అద్భుత ఫలితాలు సాధించడానికి కృషిచేసిన అధ్యాపక బృందాన్ని రవీంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ జి.పుల్లయ్య, చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, కళాశాల సమన్వయకర్త సురేంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డిలు అభినందించారు.

నారాయణ ప్రభంజనం..

విశాలాంధ్ర -కర్నూలు సిటీ : ఇంటర్ సప్లి మెంటరీ ఫలితాలలో కర్నూలు నారాయణ విద్యా సంస్థల విద్యా ర్థులు ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచి, మంచి ఫలితాలను కైవసం చేసుకున్నారని కర్నూలు నారాయణ విద్యా సంస్థల యాజ మాన్యం తెలిపింది. జూనియర్ బైపీసీ నందు మహమ్మద్. హాసీన 437 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాన్ని కైవసం కోగా, అబ్దుల్ ఉమర్ షేక్ 436 మార్కులు, మహమ్మద్ సైఫ్ 435 మార్కులు, మహమ్మద్ నజీర్ 435 మార్కులు, దీపిక 435 మార్కులు, అఖిల 435 మార్కులు లాంటి అత్యున్నత మార్కులతో సత్తా చాటారు.జూనియర్ బైపిసిలో 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో మధుర వాణి 467 మార్కులు, షేక్ జోహ 466 మార్కులు, పి.హరిణి 466 మార్కులు, కె.అక్షయ 466 మార్కులు, పి.జస్వంత్ నాయక్ 466 మార్కులు, ఎమ్.వర్షిత రెడ్డి 466 మార్కులు, ఐ.ఎంజెల్ వాణి ఈడెన్ 466 మార్కులు, బి. స్పందన 466 మార్కులు, ఎమ్. శ్రావణి 466 మార్కులు, ఇ.ప్రహస 466 మార్కులు సాధించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డీజీఎం టి.గోవర్ధన్ రెడ్డి, డీన్లు ఆంజనేయ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె.హవీల స్రామాట్, వేణు గోపాల్ రెడ్డి, జయరామి రెడ్డి, సుధాకర్ రెడ్డి, విజయ మోహన్, పి.సుజాత, సాంబశివా రెడ్డి, సూర్యకుమారి, ఖైరునీసాబీ అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీ తెలుగు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ ఊరు పేరు భైరవకోన

విశాలాంధ్ర - కర్నూలు : జీ తెలుగు ఈ ఆదివారం మరో సూపర్ హిట్ హారర్ థ్రిల్లర్ తో మీ ముందుకు రాబోతోంది, ఆసక్తికరమైన కథాంశంతో మిస్టరీ, అడ్వెంచరస్ హారర్ మూవీగా రూపొందిన ఊరు పేరు భైరవకోన జూన్ 30, ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు మీ జీ తెలుగులో ప్రదర్శన కానుంది.'ఊరు పేరు భైరవకోన' సినిమా కథ బసవ పాత్ర చుట్టూ తిరుగుతుంది బసవ తన స్నేహితుడు జాన్ తో కలిసి ఓ దొంగతనం చేస్తాడు. ఈ క్రమంలో పోలీసుల నుంచి తప్పించుకుంటూ అనుకోకుండా భైరవకోన అనే ఊరిలోకి వస్తారు అయితే, ఈ ఇద్దరితో పాటు గీత కూడా ఆ ఉళ్ళోకి వస్తుంది. ఇంతకే, ఆ భైరవకోన ఊరు ప్రత్యేకత ఏంటి, అక్కడ కనిపించే మనుషులు ఎవరు, గరుడ పురాణంలో కనపడకుండా పోయిన నాలుగు పేజీలకి భైరవకోనకి మధ్య ఉన్న సంబంధం ఏంటి అనే విషయాలు తెలియాలంటే ఊరు పేరు భైరవకోన సినిమా చూడాల్సిందే.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - ఆస్పరి : కాకినాడలో జులై 8,9,10 తేదీలలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులను జయ ప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐవైఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల కరపత్రాలను ఏఐవైఎఫ్ నాయకులు, విద్యార్థులు చేతులు మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా శరత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు రాజకీ యాలు, ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థి దశలోనే నేర్చుకోవాలని తెలిపారు. కేవలం చదివే కాకుండా ఈ సమాజానికి ఉపయోగపడే విధంగా ఈ సమాజంలో విద్యా వ్యవస్థలో జరుగుతున్నటువంటి అవినీతిని వెలికి తీయడానికి, అవినీతి అక్రమాల పైన పోరాటాలు చేయడానికి ఈ శిక్షణా తరగతులలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలో రాష్ట్రంలో విద్యారంగంలో వస్తున్న మార్పులపై సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులపై విద్యార్థులలో చైతన్యం నింపడానికి విద్యార్థుల శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్య కాషాయీకరణ, విద్య ప్రైవేటీకరణ చేస్తూ నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యా వ్యవస్థ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. పాలక ప్రభుత్వాలు విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తూ విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని, డిగ్రీ ప్రవేశాలను ఆన్లైన్ విధానాన్ని రద్దుచేసి ఆఫ్లైన్ విధానంలో కొనసాగించాలని, కేజీ టు పీజీ వరకు ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈశ్వర్, మండల నాయకులు రాజు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్, నాయకులు దస్తగిరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక హక్కుల పరిరక్షణకై మరో పోరాటం : సీపీఐ

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: బడుగు బలహీన వర్గాల శ్రామిక వర్గాల హక్కుల పరిరక్షణకై నిరంతరం పోరు సాగిస్తామని సీపీఐరి పట్టణ కార్యదర్శి జి.రంగన్న తెలిపారు. సీపీఐ నాయకులు ఆర్ రామచంద్ర ఏడో వర్ధంతి సందర్భంగా సీపీఐ కార్యాలయం నందు ఆయన చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు బజారి హనుమంతు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, పట్టణ సహాయ కార్యదర్శి సమీముల్లాలు మాట్లాడుతూ ఆర్.రామచంద్ర పత్తికొండ నియోజకవర్గం మారెళ్ళ గ్రామంలో జన్మించి చదువుకున్న రోజులలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఉద్యమాలకు ఆకర్షితుడై అనేక విద్యార్థి పోరాటాలకు నాయకత్వం వహించడం జరిగిందన్నారు. అనంతరం జిల్లా కమ్యూనిస్టు పార్టీ ఆదేశాల మేరకు ఎమ్మినూరుకు రావడం, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘానికి నాయకత్వం వహిస్తూ మరోపక్క కమ్యూనిస్టు పార్టీ భావాలకు ఆకర్షితుడై పట్టణ కార్యదర్శిగా, మండల కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యులుగా, పని చేయడం జరిగిందని వారు గుర్తు చేశారు. ఎమ్మిగనూరు నియోజవర్గంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే, మరోపక్క భూమిలేని నిరుపేదలకు భూములు పంచాలని భూ పోరాటాలు నిర్వ హించి జైలు జీవితం గడపడం జరిగిందన్నారు. కామ్రేడ్ రామచంద్ర ఆశయాలకై పార్టీ ప్రజాసంఘాల కార్యకర్తలు పని చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ ప్రజా సంఘాల నాయకులు విరుపాక్షి నాయుడు, కెసి జబ్బర్, దాదా వలి, తిమ్మ గురుడు, వీరేష్, మాలిక్, రంగ స్వామి, కాజా, మల్లికార్జున గౌడ్, వెంకటేశు, నర సింహులు, వీరాంజి గౌడ్, ఎల్లప్ప, నారాయణ, ఖాదర్, సమీర్, వీరేంద్ర, అల్లా బకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్టీయూ ఉపాధ్యాయులు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థ సారధిని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు బుధ వారం ఆర్అండ్బి గెస్ట్ హౌస్‌లో గౌరవప్రదంగా కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు రాష్ట్ర కౌన్సిలర్ వీర చంద్ర యాదవ్, అసోసియేట్ అధ్యక్షులు నాగేంద్రప్ప, జిల్లా కౌన్సిలర్ నరసింహులు, పట్టణ శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రవి,భీమరాజు పలువురితో కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారధికి అందజేశారు. పురపాలక పాఠశాలలో 14 ఏళ్లుగా అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయాలన్నారు. సిపిఎస్‌ను రద్దుచేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పేర్కొన్నారు. ఆదోనిలో టీజీఎల్వీ, వైఎంకె, జిహ్వేశ్వర ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వ పాఠశాలలోకి విలీనం చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించాలని కోరారు. ఐఆర్ తక్షణమే ప్రకటించి బకాయిలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - ఆస్పరి : అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే ఫర్టిలైజర్ డీలర్లపై కఠిన చర్యలు తప్పవని ఆలూరు వ్యవసాయ శాఖ ఏడిఏ సునీత హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోనే పలు ఫర్టిలైజర్ దుకాణాలలో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు, బిల్స్ బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు కంపెనీ నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ల లైసెన్స్ రద్దు చేసి దుకాణాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. లైసెన్సు, దుకాణం స్టాకు నిలువల ధరల పట్టికను షాపు ముందు బోర్డుపై రోజు రాయాలని సూచించారు. రైతులు సైతం విత్తనాలు కొనుగోలు చేసిన షాపు నుంచి రశీదు తీసుకోవాలని, విత్తనం మొలకకూ రాకుంటే సంబంధిత కంపెనీ నుంచి నష్ట పరిహారం పొందవచ్చని తెలిపారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి నరేంద్ర కుమార్, ఎంపీఈఓ వెంకటేష్ సిబ్బంది పాల్గొన్నారు.

పొందిన రుణాలు సకాలంలో చెల్లించాలి

విశాలాంధ్ర-చిప్పగిరి: బ్యాంకులు ద్వారా పొదుపు సంఘాల మహిళలు పొందిన రుణాలను చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలని చిప్పగిరి కెనరా బ్యాంక్ అధికారిని మేఘన అన్నారు. బుధవారం మండల కేంద్రమైన చిప్పగిరిలోని వెలుగు కార్యాలయము నందు మండల వెలుగు ఏపీఎం నాగార్జున ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల వెలుగు బుక్ కీపర్ లకు రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిప్పగిరి కెనరా బ్యాంక్ అధికారిని మేఘన మాట్లాడుతూ మండల కేంద్రమైన చిప్పగిరి గ్రామంతో పాటు నంచర్ల, దౌల్తాపురం, కాజీ పురం, గుమ్మనూరు,గుమ్మనూరు కొట్టాల, బంటన హాలు, ఏరూరూ, డేగల హాల్, కుందనగుర్తి ,బెల్డోన గ్రామాలతో పాటు ఆయా గ్రామాలలోని పొదుపు మహిళలు సంఘాల ద్వారా పొందిన రుణాల జీవనో పాధికై ఉపయోగించాలన్నారు. చిప్పగిరి వెలుగు ఏపిఎం నాగర్జున మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాలలోనే డ్వాక్రా సంఘాల పొదుపు మహిళలు బ్యాంకులు ద్వారా పొందిన ఋణాలతో జీవనోపాధి అయిన ఆవులు, గేదలు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం వంటి వాటిపై బుక్ కీపర్‌లకు అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా సంఘాల గ్రేడింగ్, లోక్స్ యాప్ నందు సంఘాలను చేర్పించడం, మండల, గ్రామ సంఘాల సమావేశాలు నిర్వహించడం, బ్యాంకు లింకేజీలు, సి ఐ ఎఫ్ ఉన్నతి రికవరీ గురించి విజన్ బిల్డింగ్ ట్రైనింగ్ పై బుక్ కీపర్ లకు రివ్యూ సమావేశము నిర్వహించడం జరిగిందన్నారు. డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇప్పించడంలోనూ, తిరిగి చెల్లించడంలోనూ బుక్ కీపర్లే కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు లక్ష్మన్న పాల్గొన్నారు.

రైతు బజార్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఇంఛార్జి కలెక్టర్

విశాలాంధ్ర - కర్నూలు : రైతు బజార్లో రైతులు విక్రయిస్తున్న టమోటా, ఉల్లి తదితర కూరగాయల ధరలను ఇంఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య విక్రయదారులను అడిగి తెలుసుకున్నారు. రైతు బజార్ లో ఏర్పాటు చేసిన ధరల పట్టిక ప్రకారమే విక్రయిస్తున్నారా, లేక అధిక ధరలకు విక్రయిస్తున్నారా అని కూరగాయలు కొంటున్న ప్రజలను జిల్లా ఇంఛార్జి కలెక్టర్ అడిగారు. రైతు బజార్‌లో కొంతమంది అమ్మకం దారులు పాడైన కూరగాయలను ఎక్కడంటే అక్కడ పారవేయడం చేత అపరిశుభ్రంగా ఉన్నదని, అలాకాకుండా కూరగాయల విక్రయదారులు పాడైన కూరగాయలను అక్కడనే ఏర్పాటుచేసిన డస్ట్ బిన్ లలో వేయాలన్నారు. అలాకాకుండా ఎక్కడంటే అక్కడ వేసినట్లైతే సీసీ కెమెరాల ద్వారా సంబంధిత వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వారు రైతు బజార్లో అమ్మకాలు చేయకుండా లైసెన్స్ కూడా రద్దు చేయడం జరుగుతుందని ఇన్చార్జి కలెక్టర్ హెచ్చరించారు. ఇన్చార్జి కలెక్టర్ వెంట మార్కెటింగ్ ఎడి నారాయణ మూర్తి, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు, తదితరులు ఉన్నారు.

పంచాయతీల బలోపేతమే లక్ష్యంగా పని చేయాలి



విశాలాంధ్ర - జిల్లా పరిషత్ : గ్రామ పంచాయతీల బలోపేతమే లక్ష్యంగా గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పని చేయాల్సిన అవసరం ఉందని 5వ ఆర్థిక సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. బుధవారం కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఎంపీడీవో, ఈవోఆర్డి, సెలెక్ట్ కాబడిన పంచాయతీ అధికారులు సర్పంచులతో కమిషన్ సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు. జడ్పీ సీఈఓ జి.నాసర రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 5వ ఆర్థిక సంఘం ప్రతినిధులు రమణారెడ్డి, పద్మారావు, ప్రసాద్ రావు, కృపావరము, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు నంద్యాల జిల్లాల డిపిఓలు నాగరాజు నాయుడు, మంజుల వాణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు మాట్లాడుతూ దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని, కాబట్టి గ్రామ పంచాయతీల అభివృద్ధికి పంచాయతీరాజ్ అధికారులు, ప్రజాప్రతినిధులు తమ హక్కులు మరియు బాధ్యతలను గుర్తు చేశారు. పంచాయతీల అభివృద్ధికి పంచాయతీ అధికారులు ఎలాంటి పనులు చేస్తున్నారు, ఆదాయం ఎలా సమకూరుస్తున్నారని దానిపై ఆరా తీశారు. గ్రామపంచాయతీలో ప్రథమ కర్తవ్యంగా రోడ్లు, తాగు నీరు, పారిశుద్ధ్యము, స్ట్రీట్ లైట్లు, స్మశాన వాటికల అభివృద్ధి చేసి ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు పంచాయతీలు ఇంటి పన్నులే ప్రధాన ఆదాయమునగా చెప్పారు. పనులను కూడా ఏ విధంగా వసూలు చేస్తున్నారు, ఏ పద్ధతి ప్రకారం వసూలు చేసినారు కమిషన్ సభ్యులు ఆరా తీశారు. ఇంటి పనులు రెండు విధాలుగా వసూలు చేస్తున్నట్లు తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

మనోవేధనతో ఆదర్శ రైతు మృతి

విశాలాంధ్ర -కల్లూరు: కూతురు క్రిమిసంహారకమందు తాగి చికిత్స పొందుతూ రోజు, రోజుకు ఆమె ఆరోగ్యం క్షీణిస్తున్నాడంతో ఆమె తండ్రి ఆదర్శ రైతు కొప్పుల కృష్ణారెడ్డి (60) మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఈ మేరకు కర్నూలు జిల్లాలో వ్యవసాయం సాగు చేయడంలో ఎప్పటికప్పుడు అదునా తన పద్ధతులను అవలంబిస్తూ, మూగజీవాల సైతం పెంచి పోషించి జీవనం సాగిస్తూ జిల్లాలోనే ఆదర్శంగా నిలిచారు. గత దశాబ్దాలుగా వృషభాలను పెంచి బండలాగు పోటీ ప్రదర్శనలో పాల్గొని అనేక బహుమతులు కైవసం చేసుకున్న పథకాలు ఎన్నో ఆయన గుమ్మం తొక్కిన ప్రతి ఒక్కరికి దర్శనమిస్తున్నాయి. మిడుతూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన కొప్పుల కృష్ణారెడ్డి వ్యవసాయంపై ఆధారపడి దశాబ్దాలుగా జీవనం సాగిస్తూ యువ రైతులకు ఆదర్శంగా నిలుస్తూ ఉండేవాడు. ఆయనకు నలుగురు సంతానం. ముగ్గురు కూతుర్లు, ఒక అబ్బాయి. వారిలో రెండవ కుమార్తె పుష్పావతికి వివాహమై మెట్టినింటి దగ్గర విషపూరితమైన ద్రవపదార్థం తీసుకొని గత 15 రోజులుగా కర్నూలు సర్వజన వైద్యశాలలో ఏఎంసి వార్డులో చికిత్స పొందుతుండుతూ కోమాలో ఉండిపోయింది. ఆమె ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుండటంతో తన కూతురు ఏమైపోతుందో ఆమె పిల్లలు పరిస్థితి ఏమిటో అని రోజు కూతురు విషయమై ఆలోచన చేస్తూ మనోవేదనకు గురై ఒక్కసారిగా ఆసుపత్రి ప్రాంగణంలో కృష్ణారెడ్డి అందరూ చూస్తుండగానే కుప్పకూలి పడిపోయారు. గమనించిన కుటుంబీకులు వెంటనే అత్యవసర విభాగంలోకి తీసుకెళ్లి చికిత్స చేయించేందుకు ప్రయత్నించగా పలు రకాలుగా వైద్యులు విశ్వప్రయత్నాలు చేసిన అప్పటి ప్రయత్నాలు ఫలించకపోవడంతో వైద్యులు ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో కుటుంబీకులు గ్రామస్తులు శోకసముద్రంలోకి మునిగిపోయారు. మృతుడు గ్రామంలో రైతులకు ఏ చిన్న అవసరం వచ్చిన తాను దగ్గరుండి చూసుకొని అండగా ఉండేవాడని జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఆయన పెంచిన వృషభాలకు మంచి పేరు ఉందని వృషబాలు పెంచి పోషించడంలో ఆయనకు ఆయనే సాటి అని, ఆయన లేనిలోటు తీరనిదని గ్రామ రైతులు, తోటి స్నేహితులు పేర్కొంటున్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించే తత్వం క్రీడల ద్వారానే అలవడుతుంది

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: జీవితంలో గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించే తత్వం క్రీడల ద్వారా అలవడుతుందని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ చెప్పారు. నగరంలోని భాష్యం పాఠశాలలో తన పుట్టినరోజు సందర్భంగా కరాటే క్రీడాకారులకు డాక్టర్ శంకర్ శర్మ బెల్టులను ప్రధానం చేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా భాష్యం పాఠశాలలో క్రీడాకారులకు బెల్టులను ప్రదానం చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. భగవంతున్ని చూడాలంటే ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదని, నిష్కల్మష హృదయమున్న చిన్నారుల కళ్ళల్లో భగవంతుని చూడవచ్చని ఆయన వివరించారు. ప్రతి ఒక్కరు సొంత లాభాన్ని కొంత మానుకొని పొరుగు వారికి సేవ చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. తాను వైద్య వృత్తిలో ఉన్నప్పటికీ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం ప్రవృత్తిగా మార్చుకుని ముందుకు సాగుతున్నానని వివరించారు. మొదట తాను చిన్న పిల్లల వైద్యుడిగా చిన్నారులకు సేవలు అందించానని, ప్రస్తుతం గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్‌గా జీర్ణకోశ, కాలేయ వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ముఖ్యంగా కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ లో సాధన చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఈ క్రీడలో సుదీర్ఘంగా శ్వాస తీసుకోవడం వల్ల ఆరోగ్యపరంగా అనేక ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. ఇందులో ధ్యానం, ప్రాణాయామంవంటి ఆరోగ్యాన్ని పెంపొం దించే అంశాలు ఉన్నాయని ఆయన వివరించారు. ఇటీవల కాలంలో సరైన వ్యాయామం లేకపోవడం వల్ల జీవన శైలికి సంబంధించిన అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు, అధిక బరువు ,బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు చాలా మందిలో వస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో భాష్యం పాఠశాలల జోనల్ ఇంచార్జ్ అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ శ్రవణ్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు మాధవిజ్, సీనియర్ కరాటే శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 27, జూన్ 2024

అసోసియేషన్ కోడుమూరు తాలూకా అధ్యక్షుడుగా ఎన్నిక

విశాలాంధ్ర – కోడుమూరు: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కోడుమూరు తాలూకా యూనిట్ నూతన అధ్యక్షుడిగా కోడుమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న జి.కృష్ణా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోడుమూరు బాలుర ఉన్నత పాఠశాలలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జీ కృష్ణమోహన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికల అధికారి అయిన కోడుమూరు ఎంపిపి మండల ఇంజనీర్ వి.గంగరాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి గంగరాజు ఆధ్వర్యంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాలలోని హైస్కూల్స్, ఎంపీపీ, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల కార్యాలయాల్లో పనిచేస్తున్న ఏవోలు,రికార్డు అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్, లైబ్రేరియన్, జూనియర్ అసిస్టెంట్స్ స్థాయి ఉద్యోగస్తులకు ఏపీపీఆర్ఎంఈఏ కోడుమూరు తాలూకా యూనిట్ నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. కమిటీ నూతన అధ్యక్షుడుగా జి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సిబెళగల్ మండలంలో జడ్పీహెచ్ స్కూల్లో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కే మహమ్మద్ రఫీక్, ప్రధాన కార్యదర్శిగా కోడుమూరు బాలుర ఉన్నత పాఠశాలలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జీ కృష్ణమోహన్, ట్రెజరరీగా గూడూర్ ఎంపీపీ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న ఎంఎస్ మహబూబ్ బాష, సహాయ కార్యదర్శిగా సి.బెళగల్ ఎంపీపీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వి.మంజుల, డిస్ట్రిక్ కౌన్సిల్ మెంబర్లుగా కోడుమూరు పిఆర్ సీనియర్ అసిస్టెంట్ ఎన్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ కోడుమూరు జూనియర్ అసిస్టెంట్ కే శ్రీనివాసులు, అలాగే కో ఆప్షన్ మెంబర్లుగా లద్దగిరి జడ్పీహెచ్ స్కూల్ జూనియర్ అసిస్టెంట్ ఐజయ్య, జడ్పీహెచ్ స్కూల్ అమ్మడగుంట్ల రికార్డ్ అసిస్టెంట్ అరవింద్ లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వహణ అధికారి పి గంగరాజు ప్రకటించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడుగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఆయా శాఖలలోని ఉద్యోగస్తులందరికీ కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల ఉద్యోగులు శ్రీదేవి, ఈ రాధారాణి, అబ్దుల్ ఖాదర్, నాగన్న, రవిప్రకాష్ ,వై శ్రీనివాసులు, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయండి

విశాలాంధ్ర – నంద్యాల : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారని రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేందుకు ప్రత్యేక కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాల్లో ఖరీఫ్ సీజన్ విత్తుకు సంబంధించి జాయింట్ కలెక్టర్ టీ. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, మైక్రో ఇరిగేషన్, మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ, ఇరిగేషన్ తదితర శాఖలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర నివేదికలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే అడపాదడపా వర్షాలు కురిసి జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 76.7 శాతం అధిక వర్షపాతం నమోదైన నేపథ్యంలో ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేసుకుని రైతులకు అవసరమైన విత్తనాలు రాయితీపై సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జూలై, ఆగస్టు మాసాల్లో సాగు చేసే రైతులకు నాణ్యమైన విత్తనాలు, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల కొరత ఏర్పడకుండా ఇప్పటినుండే ప్రణాళిక వేసుకోవాలన్నారు. లక్ష్యం మేరకు విత్తన శుద్ధి, భూసార పరీక్షలు నిర్వహించి రైతు ఏ పంటలు వేసుకుంటే అధిక దిగుబడి సాధిస్తారో ఆయా పంటలను వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు జరిపి నకిలీ, బ్లాక్ మార్కెటింగ్ విధానాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని మండల అగ్రికల్చర్ అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన విత్తనాల సరఫరాకు సంబంధించి సీడ్ కార్పొరేషన్ లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉద్యాన శాఖ, డ్రిప్ ఇరిగేషన్లకు సంబంధించి మండలాల వారీగా పంటల విస్తీర్ణం, చేపట్టి అభివృద్ధి చేయాల్సిన లక్ష్యం సంబంధిత వివరాల నివేదికలను వారం రోజుల్లో ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్రీశైలం డ్యాం, ఇతర రిజర్వాయర్లలో ఉన్న నీటి లభ్యతే వివరాలను ప్రతి 15 రోజులకు ఒకసారి నివేదికలను అందజేయాలని ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరమణను కలెక్టర్ ఆదేశించారు. రిజర్వాయర్లు, నీటి ట్యాంకులలో చేప పిల్లల ఉత్పత్తిపై ప్రణాళికలు సిద్ధం చేసి నివేదికలు ఇవ్వాలని మత్స్యశాఖ ఏడిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని పశుసంపదకు నిర్దేశిత సమయానికి వ్యాక్సినేషన్ ఇవ్వడంతో పాటు బీమా వర్తింపుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇచ్చే పంట రుణాలు పేపర్ల మీదనే కాకుండా నిజమైన కర్షకులకు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ను ఆదేశించారు. అలాగే జిల్లాలో ఉన్న 27 వేల మంది కౌలు రైతులకు కూడా పంట రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అందుకు సంబంధించి విఆర్వోలు, తాసిల్దారులకు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో గత సంవత్సరం సాధించిన లక్ష్యాలు ప్రస్తుత సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను పోలుస్తూ సమగ్ర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ఎరువుల కు సంబంధించి ఎన్ని రాక్స్ వచ్చాయి మార్క్ఫెడ్, ప్రైవేట్ హోల్సేల్ డీలర్ల దగ్గర ఏ మేరకు స్టాకు వివరాలు ఉన్నాయో సంబంధిత నివేదిక అందజేయాలని వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. భూసార పరీక్షలు, విత్తన శుద్ధి శాంపిల్స్ బయోలాజికల్ ల్యాబ్ కు పంపిన వివరాలను ఇవ్వాలన్నారు. పొలంబడి కార్యక్రమాలు తూతూ మంత్రంగా నిర్వహించకుండా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు తెలిపి అధిక దిగుబడి సాధించే పంటను వేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ, గోస్పాడు మండలాలలో నకిలీ విత్తనాల విక్రయం ఎక్కువగా జరుగుతోందని సంబంధిత డీలర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వడంతో పాటు లైసెన్సులు కూడా రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్డీవోలు మల్లికార్జున రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎం దాస్, అన్ని మండలాల తాసిల్దారులు, వ్యవసాయ వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షితమైన తాగునీరు

విశాలాంధ్ర – కర్నూలు సిటీ : నగర ప్రజలకు సురక్షిత, స్వచ్ఛమైన తాగునీటిని అందిం చడమే తమ ధ్యేయమని నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ అన్నారు. బుధవారం ఉదయం నగరంలో పూలబజార్, స్వామిరెడ్డి నగర్, లక్ష్మి నగర్, శరీన్ నగర్ గీతముఖర్జీ నగర్ తదితర ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తాగునీటిలో అవశేష క్లోరిన్‌ను కమిషనర్ పరీక్షించారు. అతిసార వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి నాణ్యతలను ప్రతిరోజూ పరీక్షించాలని, సరఫరాలో కలుషితానికి ఆస్కారం లేకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈలు శేషసాయి, షాకీర్, డిఈఈలు రవిప్రకాష్ నాయుడు, నరేష్, ఏఈలు జనార్దన్, భాను తదితరులు పాల్గొన్నారు.

నీటి వసతి కల్పించిన ఎంపీపీ

విశాలాంధ్ర – శిరివెళ్ల : మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ పంచాయతీ గ్రామంలో అన్వర్ హోటల్ పక్క సందు కాలనీలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు నాయక్ మహమ్మద్ వసీం గారు శాశ్వత నీటి వసతి కల్పించారు. ఎన్నికలకు ముందు నీటి సరఫరా పైపులైన్ మొదలుపెట్టగా నాడు ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో పనులకు విరామం ఇవ్వాల్సి వచ్చిందని అన్నారు.ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పనులు చేపట్టి పైపులైన్ పూర్తిచేసి పబ్లిక్ ట్యాబ్లు ఏర్పాటు చేసి కాలనీ ప్రజలకు నీటి సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని ఎంపీపీ తెలియజేశారు. నీటి ఎద్దడి సమస్యతో కష్టపడుతున్న కాలనీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వారికి నీటి సమస్యను పరిష్కరించి శాశ్వత పరిష్కారం అందించడం జరిగిందని ఈ సందర్భంగా ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కాలనీ ప్రజలు ఎంపీపీ గారికి అధికారులకు ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

లోక్ అదాలత్‌పై అవగాహన శిబిరం

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్ : ప్రజా వినియోగ సేవల కోసం శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకట హరినాథ్ న్యాయ సేవ సదన్ నందు అన్ని శాఖల అధికారులకు చట్టపరమైన అవగాహన శిబిరం నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న ఈ శాశ్వత లోక్ అదాలత్‌కు ప్రస్తుతం రిటైర్డ్ న్యాయమూర్తి ఎం.వెంకట హరినాథ్ చైర్మన్‌గా వ్యవహరిస్తునారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం కలిగి వున్న వారందరికి ఎలాంటి కోర్ట్ ఖర్చులు లేకుండా సత్వర న్యాయం అందించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయబడిన వ్యవస్థ పర్మనెంట్ లోక్ అదాలత్ అని తెలిపారు. రాష్ట్ర హై కోర్ట్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక చట్టం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడిందన్నారు. ఈ తీర్పుకు ఎలాంటి అప్పీలు లేదని, ఈ వ్యవస్థ ద్వారా 10 ప్రజా ప్రయోజిత సేవ రంగాలకు సంబంధించిన సేవలలో లోపాల వలన కలుగు నష్టాలను విన్నవించి సంబంధించిన న్యాయం త్వరగా పొందవచ్చన్నారు.

పులుల నుండి ప్రజలకు రక్షణ కల్పించండి

విశాలాంధ్ర – శిరివెళ్ల: మండల పరిధిలోని, పచ్చర్ల గ్రామంలో చిరుత పులి దాడిలో చనిపోయిన షేక్ మెహరీన్ బికుటుంబానికి ప్రభుత్వం వెంటనే ఎక్సిగేసి చెల్లించి వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని సిపిఎం నాయకులు టి .రామచంద్రుడు, మరియు వి. బాల వెంకట్ ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పచ్చర్ల గ్రామంలోని ప్రజలందరూ మూడు రోజుల నుండి భయాందోళనలతో జీవిస్తున్నారని, చాలా కుటుంబాలు ఇల్లు వదిలి, ఊరు వదిలిపెట్టి వెళ్లే పరిస్థితి ఏర్పడింది అని అందుకు ప్రధాన కారణం చిరుత పులులు దట్టమైన అడవి ప్రాంతాన్ని వదిలిపెట్టి గ్రామానికి సమీపంలో సంచరించడం, పచ్చర్ల, సర్వ నరసింహస్వామి దేవాలయం, ఆంజనేయ కొట్టాల, మహానంది తదితర అటవీ సమీప ప్రాంతాల్లోని పంట పొలాల్లో కూడా ఈ మధ్యకాలంలో చిరుత పులుల, ఎలుగుబండ్ల సంచారం తీవ్రంగా పేరిగిపోయింది అన్నారు. అందువల్ల అడవి సమీప్రాంత గ్రామాల్లోని ప్రజలు వ్యవసాయ కూలీ పనులకు వెళ్లాలంటే కూడా చాలా భయపడుతున్నారు. రైతులు తమ పొలాలు చూసుకోవడానికి కూడా ఒంటరిగా అంతేకాకుండా గాజులపల్లి నుండి గిద్దలూరుకు ప్రయాణించడానికి కూడా వాహనదారులు భయపడు చున్నారు.కావున అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ప్రత్యేక ఆపరేషన్ జరిపి చిరుతపులులను పట్టుకొని ప్రజానీకానికి సుదూర ప్రాంతాల్లో, దట్టమైన అడవిలో ఉండే విధంగా చిరుతలను తరలించాలని, తద్వారా ప్రజల్లో ఉన్న భయాందోళనలను పోగొట్టాలని వారు కోరారు.

వీధి బాలల నిర్మూలనకై ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర –కర్నూలు ఎడ్యుకేషన్ : వీధి బాలల దినోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, జిల్లా కమీషనర్ ఆఫ్ లేబర్ వెంకటేశ్వర్లు, ఏసీఎల్‌సీ సాంబ శివ ఆద్వర్యంలో, వీధి బాలలను గుర్తించడానికి ప్రత్యక్షంగా కదం కదిపారు. సంబంధిత శాఖ అధికారులు, డీసీపీవో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజర్, జాతీయ బాల శ్రమ ప్రాజెక్ట్, కర్నూలు, జిల్లా ప్రొబేషనరీ అధికారి, కౌన్సెలర్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 వారు, సివిల్ సొసైటీ వారు, పోలీసు, విద్యా శాఖ, జువెనైల్ సంక్షేమం మొదలైన అధికారుల సహకారంతో కర్నూలు పట్టణంలో రెండు బృందాలుగా వెళ్ళి కొత్త బస్టాండ్, పాతబస్టాండ్, వీఆర్ కాలనీ, బళ్ళారి చౌరస్తా, ఆటోనగర్, ఉల్చాల రోడ్, సంతోష్ నగర్, చిల్డ్రన్స్ పార్క్, ఓల్డ్ కంట్రోల్ రూమ్, 4వ టౌన్ ఏరియాలలో తనిఖీలు నిర్వహించారు. జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దడానికి సిబ్బంది అందరూ సమిష్టిగా పనిచేయాలని చెప్పారు. ఆయా ప్రదేశాలలో ఉన్న ముగ్గురు వీధి బాలలను గుర్తించడం జరిగిందన్నారు. అనంతరము జిల్లా బాలల సంక్షేమ సమితి ముందు పిల్లలను, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

మహానంది అటవీ పరిసర ప్రాంతాలలో అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర – నంద్యాల : మహానంది అటవీ పరిసర ప్రాంతాలలో చిరుతపులి సంచారంతో ప్రజల ప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాల్లో చిరుత పులి సంచారం – జాగ్రత్తలపై జాయింట్ కలెక్టర్ టీ. రాహు కుమార్ రెడ్డితో కలిసి అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా, నంద్యాల డిఎఫ్ఓ శివ శంకర్ రెడ్డిలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా సరిహద్దులోని నల్లమల అటవీ పరిసరాల్లో ఉన్న గ్రామాల సమీపాల్లో చిరుత పులి సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న సందర్భంలో మహానంది, శిరివెళ్ల, రుద్రవరం మండలాల్లోని అన్ని గ్రామాలలో మూడు రోజులపాటు దండోరా వేయించి ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత మండల తాసిల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ పరిసర ప్రాంతాలలోనికి ప్రజలు ఎవరిని అనుమతించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఫారెస్ట్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇటీవల కాలంలోనే చిరుతపులి దాడికి నలుగురు వ్యక్తులు గాయపడినట్లు వెల్లడైన నేపథ్యంలో అటవీ చెక్ పోస్ట్‌ల వద్ద విధుల్లో ఉన్న ఉద్యోగులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ పులుల సంచారంపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ సూచించారు. పెచ్చర్ల సమీపంలో చిరుతపులిని పట్టుకునేందుకు సీసీ కెమెరాలతో పాటు బోన్ కూడా ఏర్పాటు చేశామని అటవీ శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు.

చెడు వ్యసనాలకు బానిసలై... బంగారు భవిష్యత్తును కోల్పోకండి

విశాలాంధ్ర – కర్నూలు క్రైమ్ : మత్తు పదార్థాలతో తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు జిల్లా ప్రజలకు కోరారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు బుధవారం కర్నూలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు, సెబ్ సూపరింటెండ్ రవి కుమార్, ఎక్సైజ్ సూపరింటెండ్ సుధీర్ బాబు, కర్నూలు డిఎస్పీ విజయ శేఖర్, సెబ్ అసిస్టెంట్ సూపరింటెండ్ వినోద్ కుమార్, ట్రాఫిక్ సిఐ గౌతమి, కర్నూలు ఒకటవ పట్టణ సిఐ పవన్ కుమార్, కర్నూలు తాలుకా సిఐ శ్రీధర్, సెబ్ సిఐ రాజేంద్ర ప్రసాద్, డిటిఎఫ్ సిఐ నరసిం ాయుడు పాల్గొన్నారు. ఈ ర్యాలీ మొదట కర్నూలు కంట్రోల్ రూమ్ – ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుండి ప్రారంభమై కర్నూలు సెబ్ స్టేషన్ – ఓల్డ్ కంట్రోల్ మీదుగా కర్నూలులోని పలు పాఠశాల విద్యార్థులతో కలిసి కర్నూలు కొండారెడ్డి బురుజు వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అక్కడ అందరూ మానవహారం ఏర్పాటు చేసి విద్యార్థులు, పౌరసమాజంతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ సంధర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు మాట్లాడారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులతో సమావేశమై ప్రధానంగా యువత, విద్యార్థులు మేల్కొని ప్రజలు మత్తు పదార్థాలతో జీవితాలు బుగ్గిపాలు చేసుకోకుండా చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు.గంజాయి, తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాల జోలికెళితే చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకుంటారో వివరించారు.100 రోజులలో డ్రగ్స్ నిర్మూలనకు కార్యా చరణ ప్రణాళిక అమలు చేసి, కర్నూలు జిల్లాను డ్రగ్స్, గంజాయి రహిత కర్నూలు జిల్లాగా తీర్చి దిద్దుతామన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు తమ వంతు సామాజిక బాధ్యతగా పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

ఆత్మకూరులో..

హొళగుందలో..

కర్నూలులో..

వెలుగోడులో..

చాగలమర్రిలో..

ఆళ్లగడ్డలో..

కోవెలకుంట్లలో..

గోనెగండ్లలో..

కోడుమూరులో..

ఆలూరులో..

జిల్లా న్యాయసేవాధికా సంస్థ కర్నూలులో..

కోగిలలో..

సంక్షేమ పథకాలు పునరుద్ధరించండి..

విశాలాంధ్ర – కర్నూలు జిల్లా పరిషత్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పథకాలను పునరు ద్ధరించాలని జిల్లా కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ తెలియజేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అనంత రత్నం మాదిగ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలు నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రద్దు చేయడం జరిగిందన్నారు. నేటి టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ పథకాలన్నింటినీ పునరుద్ధరించాలన్నారు. మొత్తం 27 పథకాలను పునరుద్ధరణ చేసి అమలు చేయాలని, ఎస్సీల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఎస్ సి బజారన్న, సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ డిసిసి కార్యదర్శులు ఎజాజ్ అహ్మద్, జాన్ సదానందం మొదలగు వారు పాల్గొన్నారు.

ప్రధానిని కలిసిన కర్నూలు ఎంపీ

విశాలాంధ్ర – కర్నూలు సిటీ : భారత దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసారు. బుధవారం పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఢిల్లీలో ఉన్న నాగరాజు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తో పాటు ఇతర టిడిపి ఎంపీలతో కలిసి ప్రధాన మంత్రి కార్యాలయంలో మోదీని కలిసి కురబ సామాజిక వర్గానికి చెందిన కందువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధితో పాటు కర్నూలు అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ప్రధాన మంత్రి మోదీని కోరానని, ప్రధాన మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఉల్లి, టమోటా అందుబాటులో ఉండేలా చర్యలు

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : ఉల్లి, టమోటాలను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులను జిల్లా ఇంఛార్జి కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో టమోటా, ఉల్లి ధరల నియంత్రణ కమిటీ సమావేశం జిల్లా ఇంఛార్జి కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ఇంఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లి, టమోటాలను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు గాను టమోటాలను చిత్తూరు నుండి తెప్పించుకొని నో లాస్–నో గెయిన్ క్రింద రైతు బజార్లలో అమ్మడంతో పాటు ఉల్లిను కూడా మహారాష్ట్ర నుంచి అవసరాన్నిబట్టి తెప్పించి అమ్మడం జరుగుతోందన్నారు. రానున్న నెలల్లో మన జిల్లాలోని రైతులు ఉల్లి, టమోటా పంట వెయ్యడం ద్వారా ఇంకా తక్కువ ధరకు ఉల్లి, టమోటా అమ్మే అవకాశం ఉంటుందని, అందుకు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ఒకవేళ ధరలు పెరిగినా అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకో వాలని మార్కెటింగ్, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులను ఆదేశించారు.

త్రో బాల్ పోటీల్లో విజ్ఞాన పీఠం ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర – కర్నూలు : ఇటీవల జరిగిన ఒలింపిక్ డే సందర్భంగా కర్నూలు జిల్లా త్రోబాల్ పోటీల్లో కర్నూల్ నగర శివారులోని విజ్ఞాన పీఠం ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభను చాటారు. జిల్లాస్థాయిత్రోబాల్ పోటీలలో ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు పాల్గొన్నాయి. కర్నూల్ గుడ్ షెఫర్డ్ స్కూల్ సంస్థ వారు నిర్వహించిన పోటీల్లో బాలుర విభాగంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని విజ్ఞాన పీఠం ఉన్నత పాఠశాల తన ప్రతిభను చాటుకుంది. గెలుపొందిన విద్యార్థులను విజ్ఞాన పీఠం ఉన్నత పాఠశాలలో అభినందిస్తూ అభినందన సభ జరిగింది. ఈ సభలో విజ్ఞాన పీఠం కార్యదర్శి పి పి గురుమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు చదువులో భాగంగా ఆటలు ఉండాలని ,ఆటలలో నైపుణ్యాన్ని పొందినవాడే జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్తారని తెలియజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ రామిరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ విజ్ఞాన పీఠం ఉన్నత పాఠశాల అంటే జిల్లాలో త్రోబాల్ పోటీలకు మరో పేరుగా నిలిచిందని తెలిపారు. సుదర్శనం, స్వర్ణలత, సోమయ్య, రణధీర్ రెడ్డి, వంశీ రాఘవ, మురళి, రేణుక విద్యార్థులకు సర్టిఫికెట్లను, మెడళ్ళను, బహుమతులను అందజేశారు.

గ్రామ సర్పంచుల డిమాండ్లను నెరవేర్చాలి

విశాలాంధ్ర – హొళగుంద : గ్రామ సర్పంచుల అన్ని డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని ఆదోని డివిజన్ సర్పంచ్ సంఘం అధ్యక్షుడు సుధాకర్ డిమాండ్ చేశారు. కర్నూల్ లో బుధవారం జరిగిన 15వ ఫైనాన్స్ అధికారులకు, జిల్లా పంచాయతీ అధికారులకు వినతి పత్రాన్ని ఆదోని డివిజన్ సంఘ అధ్యక్షుడు సుధాకర్ కార్యదర్శి డి.ఎస్ హేసానుల్లా సమర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఉపాధి నిధులను పంచాయతీలకు మళ్ళిస్తే గ్రామాభివృద్ధి జరుగుతుందన్నారు.గత ప్రభుత్వం వాడుకున్న 15వ ఫైనాన్స్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు .గ్రీన్ అంబాసిడర్ల జీతాలను, పంచాయతీ సిబ్బందిల జీతభత్యాలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని గ్రామాలకు విద్యుత్ దీపాలకు సరఫరా అయ్యే విద్యుత్ ఖర్చులను ప్రభుత్వం కట్టాలని కోరారు. గ్రామ సర్పంచుల వేతనాలు పెంచాలని ,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సర్పంచుల ద్వారా ఎంపిక చేసి మంజూరు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ భవనాలు లేని చోట పంచాయతీ భవనాలు నిర్మించాలని గ్రామ సచివాలయ వ్యవస్థను సర్పంచుల ఆధీనంలో పరచాలని విజ్ఞప్తి చేశారు.

వర్షం లేక నీటి కోసం రైతులకు తప్పని కష్టాలు

విశాలాంధ్ర –హొళగుంద : మండలంలో వర్షాలు సక్రమంగా కురవక రైతన్నలు సాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ముందే వర్షాలు సమృద్ధిగా మండలములో కురిసినందున రైతులు పత్తి, వేరుశనగ, జొన్న, మిరప, పొద్దు తిరుగుడు, సజ్జ, ఉద్యానవన పంటలతో పాటు ఇతర పంటలను సాగు చేశారు .విత్తనాలు మొలకెత్తి పచ్చని పైరుతో పొలాలు కళకళలాడుతున్న తరుణంలో వర్షం లేక పైర్లు వాడు ముఖం పడుతున్నాయని రైతన్నలు ఆవేదన చెందారు. బోరుబావుల ద్వారా సాగు నీరు సక్రంగా అందడం లేదని భూగర్భ జలం మట్టం తగ్గినందున పంటలకు నీళ్లు మళ్లించాలంటే కష్టంగా ఉన్నదని బోరు బావులు రైతులు పేర్కొన్నారు .తుంగభద్ర డ్యామ్ లో కేవలం 5 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉన్నాయి. తుంగభద్ర డ్యామ్ పై భాగంలో తుంగ డ్యాం వరద నీటితో పూర్తిగా నిండిపోయింది. తుంగభద్ర డ్యామ్ నీరు లేక బోసిపోయింది మండలంలో వరి పైర్లు వేసిన రైతులకు కష్టాలు తప్పడం లేదు బోరు బావులు నీరు చౌకుగా ఉన్నాయని ఎక్కువగా ఉన్నాయని వాటి ద్వారా పైర్లు ఎదగమని అందుకోసం రైతన్నలు ఎల్ఎల్సీ దిగువ కాలువలో నిల్వ ఉన్న వర్షం నీటిని డీజిల్ ఇంజన్ యంత్రం ద్వారా పొలాలకు తోడేసుకుంటున్నారు .కిలోమీటర్ దూరంలో ఉన్న పొలాలకు ఎల్ఎల్సీ దిగువ కాలువకు ఆయిల్ ఇంజన్ బిగించి నీటిని బావిలోకి మళ్లించుకుని వంట పొలాలకు ఉపయోగించుకుంటామని రైతు మంజునాథ్ తెలిపారు. సకాలంలో వర్షాలు కురిస్తే సాగునీటికి ఇబ్బంది ఉండదని పంటల దిగుబడి ఆశించే స్థాయికి వస్తుందని రైతన్నలు పేర్కొన్నారు .రైతులు రోజు వర్షం కోసం నిరీక్షిస్తూ ఉసూరు అంటున్నారు. వాతావరణ శాఖ వర్షాలు రాయలసీమలో సమృద్ధిగా కురుస్తాయంటూ సమాచారం ఇవ్వడంతో రైతులు వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అలాగే తుంగభద్ర డ్యామ్ నిండకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందారు జూన్ నెల ముగుస్తున్నప్పటికీ డ్యామ్ లో నీటి ప్రవాహం మొదలు కావడం లేదని డ్యాం ఉండకపోతే సాగు త్రాగునీటికి ఇబ్బంది ఏర్పడుతుందని ఆయకట్టు రైతులు ఆరోపించారు. మండలంలో సాగునీటి కోసం రైతన్నలు పడరాని పాట్లు పడుతున్నారు.